ప్రజాశక్తి
బుధవారం 13 మార్చి 2024 5
శ్రీ సత్యసాయి





తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

దళితుల భూముల్లో సబ్ స్టేషన్ నిర్మాణం వద్దు

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని పైడేటి గ్రామంలో 60 సంవత్సరాల నుండి దళితులు సాగు చేస్తున్న భూములలో సబ్ స్టేషన్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం బహుజన చైతన్య వేదిక అధ్యక్షుడు శివరామకృష్ణ ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి లేని నిరుపేద దళిత కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి జీవనోపాధి కోసం గత 60 సంవత్సరాల నుండి సాగు చేస్తున్న భూమిపై పెత్తందారులు కన్నేశారని విమర్శించారు. వాటిని ఇతర ప్రభుత్వ కార్యకలాపాలకు వినియోగించుకొందుకు సిద్ధమయ్యారన్నారు. పైడేటీ పంచాయతీకి నాలుగు కోట్ల రూపాయల అంచానాతో మంజూరైన సబ్ స్టేషన్ నిర్మాణానికి ఈ భూమిని వినియోగించుకోవడం నిరుపేద దళితులపై కక్ష సాధింపేనని విమర్శించారు. వెంటనే ఈ నిర్మాణ పనులను ఆపాలని ఈ భూములపై పూర్తి అధికారం రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ డీఈ భూపతి రాజు కలిసి సమస్యను వివరించారు. స్పందించిన డీఈ సమస్య పరిష్కారం అయ్యే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు రామాంజినప్ప, పైడేటి గ్రామస్తులు రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు..అభివృద్ధి లేదు..!



- ◆ బంగారు గనులున్నా ప్రయోజనం శూన్యం
- ◆ సాగునీటి ప్రాజెక్టులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే
- ◆ అన్నింటా రాప్తాడు నియోజకవర్గం వెనుకబాటు
- ◆ నీటి మూటల్లా ఎన్నికల హామీలు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని' అన్న చందంగా మారింది రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గం పరిస్థితి. ఇక్కడి భూమి పొరల్లో బంగారు నిక్షేపాలున్నా... నిష్ఫలమే. వాటిని వెలికితీసే పనులేవి ముందుకు సాగడం లేదు. ఎన్నికలొచ్చాయంటే చాలు వాటిని తెరిపిస్తామన్న హామీ మాత్రం వినిపిస్తూనే ఉంటుంది. అధికారంలోకి వచ్చాక తొలినాళ్లలో కొంత హడావుడి నడుస్తుంది. ఆ తరువాత ఒక్క అడుగు కూడా ముందుకు పడదు. పాలకులు ఎవరొచ్చినా దీనిపై దృష్టి పెడుతున్న దాఖలాల్లేవు. రామగిరిలో బంగారు గనులను తెరిపిస్తామని 2014లో టిడిపి అధికారంలోకి వచ్చాక ప్రకటించారు. ఈ మేరకు గనుల శాఖ మంత్రిగానున్న పీతల సుజాత కూడా వచ్చి పరిశీలించారు. కాని ఆ ప్రభుత్వ హయాంలో దీనికి సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చాక కూడా ఈ గనులను తెరిపిస్తున్నట్లు విదేశీ ప్రతినిధులు సైతం వచ్చి వెళ్లారు. టెండర్ల దశ వరకు కూడా సాగింది. కాని ఇప్పటికి ప్రారంభమయ్యే సూచనలు కనిపించలేదు. ఇది ప్రారంభమయితే కొంత మందికైనా ఇందులో ఉపాధి దొరుకుతుందని ఆ ప్రాంతవాసులు ఎదురు చూస్తున్నారు.



టిడిపి ప్రభుత్వ హయాంలో పేరూరు డ్యాంను పరిశీలిస్తున్న అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు (ఫైల్‌ఫొటో)

ఒకటి కాదు..మూడు అన్నారు..

పెన్నా నదిపై నిర్మించిన పేరూరు ప్రాజెక్టుకు ఎగువ నుంచి నీరొచ్చే అవకాశం లేకపోవడంతో వట్టిపోయింది. దీనికి హంద్రీనీవా నుంచి ఎత్తిపోతల ద్వారా సాగునీటిని అందివ్వాలని అంతకు మునుపు టిడిపి హయాంలో రూ.803 కోట్లతో పనులు కొంత ప్రారంభించారు. అయితే ఆ తరువాత వైసిపి ప్రభుత్వం వచ్చాక కొంతకాలం పనులు ఆపింది. ఇవే నిధులతో ఒక్క ప్రాజెక్టు కాకుండా సోమరవాండ్లపల్లి, తోపుదుర్తి ముట్టాల మూడు రిజర్వాయర్లు నిర్మించి లక్ష ఎకరాలకు నీటిని అందిస్తామని ప్రకటించారు. ఈ మేరకు శంకుస్థాపన చేశారు. ముఖ్య మంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి కూడా ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తామని హామీనిచ్చారు. అయితే ఇప్పటి వరకు భూ సేకరణకు అవసరమైన నిధులే విడుదల చేయలేదు.

పరిశ్రమలు రాలేదు..పోయాయి...!

ఈ ప్రాంతంలో ఉపాధి కల్పించే పరిశ్రమలు తీసుకొస్తున్నట్లు రెండు పార్టీల నాయకులు ప్రకటించారు. జాకీ వచ్చిందని ప్రకటించారు. అంతకు మునపు జిందాల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనలు వచ్చాయి. అయితే ఈ రెండూ ఇక్కడ ఏర్పాటవకుండానే తరలిపోయాయి. కొత్తగా ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. కొత్త పరిశ్రమలు వస్తాయని స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పలుమార్లు ప్రకటించారు. కాని ఆచరణకు నోచుకోలేదు.

మౌలిక సదుపాయలు అంతంత మాత్రమే..

నియోజకవర్గంలో మౌలిక సదుపాయలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇప్పటికీ తాగునీటికి అనేక చోట్ల ఇబ్బందులు తప్పడం లేదు. రహదారి సమస్యలు ఇంకా అనేక చోట్ల ఉన్నాయి. మౌలిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతను ఇచ్చి వాటిని పరిష్కరిస్తామంటూ నాయకులు ఇచ్చే మాటలు నీటిమూటల్లా మారుతున్నాయి.



రామగిరి బంగారు గనులను అమెరికాకు చెందిన ప్రతినిధులతో కలిసి పరిశీలిస్తున్న రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి (ఫైల్ ఫొటో)



పోలీసుల కవాతులో డిఐజి, ఎస్పీ తదితరులు

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ఓటర్లు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి, జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలను నిర్వహించాలన్న లక్ష్యంతో కేంద్రసాయుధబలగాతో కలిసి ధర్మవరంలో పలు ప్రాంతాలలో డీఐజీ, ఎస్పీడీస్పీ, సీఐలు తదితరసిబ్బంది మంగళవారం కవాతు నిర్వహించారు. ఈ సం దర్భంగా డీఐజీ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలన్నారు. కేంద్ర సాయుధదళాలు పాటించవలసిన ఎన్నికల నియమావళిలు, సమస్యలు ఏర్పడినప్పుడు వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎవరైన అనుమానాస్పద స్థితిలో కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం తెలియజేసి అదుపులోకి తీసుకోవాలని సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలలో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా జిల్లా పోలీసు యంత్రాంగం సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, బీఎస్పీ అసిస్టెంట్ కమాండెంట్ గౌతంకుమార్, ఎఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, సబ్ డివిజన్లోని సిఐలు సుబ్రమణ్యం, అశోక్ కుమార్, యతీంద్ర, కృష్ణంరాజు, శివాంజనేయులు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో 'వందేభారత్ రైలు'

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం రైల్వేస్టేషన్‌కు మంగళవారం నాడు వందేభారత్ రైలు చేరుకుంది. ఈ రైలు కలబురిగి నుంచి బెంగుళూరు వెళ్తూ మార్గమధ్యలో ధర్మవరం రైల్వేస్టేషన్లో నిలిచింది. దీంతో రైల్వే అధికారులు ట్రైన్‌కు స్వాగతం పలికారు. వందేభారత్ ట్రైన్ చూసేందుకు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. ట్రైన్ వద్ద యువకులు సెల్ఫీలు తీసుకున్నారు. వందేభారత్ ట్రైన్ ధర్మవరం మీదుగా బెంగుళూరుకు వెళ్లింది.



వందేభారత్ ట్రైన్ వద్ద సెల్ఫీలు తీసుకుంటున్న యువత

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-హిందూపురం

రానున్న సార్వత్రిక ఎన్నికలనేపథ్యంలో జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ తో కలిసి హిందూపురం రూరల్ మండలం మణేసముద్రం. పురపాలక సంఘ పరిధిలోనికొట్నురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, తహశీల్దార్ శివ ప్రసాద్ రెడ్డి, డిఎస్‌పి కంజాక్షన్, ఇతర అధికారులు, పాఠశాల హెచ్‌ఎంలు జయమ్మ, శోభ తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : మండలపరిధిలోని కంబాలపల్లి ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు మంగళవారం పరిశీలించారు. పోలింగ్‌కేంద్రం వద్ద సౌకర్యాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా స్థానిక మండల స్థాయి అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, డిఎస్‌పితో పాటు డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రంలోని సౌకర్యాలపై అధికారులతో ఆరా తీస్తున్న కలెక్టర్ అరుణ్ బాబు

జగన్‌రెడ్డికి ఓటమి భయం : సవితమ్మ



పార్టీలోకి చేరిన వారితో సవితమ్మ

ప్రజాశక్తి -పెనుకొండ

టీడీపీ, బీజేపీ , జనసేన మూడు పార్టీల పొత్తుతో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కి ఓటమి భయం పట్టుకుందని టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ అన్నారు. పట్టణంలోని తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు,కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సవితమ్మ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ తోనే పేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు. మన ప్రాంతానికి కియా లాంటి పరిశ్రమలు మరిన్ని రావాలన్నా గొల్లపల్లి రిజర్వాయర్ లాంటి ప్రాజెక్టులు మరిన్ని రావాలన్నా తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందని తెలిపారు. అందరూ కలిసి కట్టుగా పనిచేసి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండాను ఎగరవేసి చంద్రబాబుని మళ్లీ ముఖ్యమంత్రి చేద్దామని పిలుపునిచ్చారు. బుధవారం నుండి ఎన్నికల ప్రచార కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని మునిమడుగు నుంచి ప్రచారం ప్రారంభమవుతుందని పెద్ద ఎత్తున టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు డాక్టర్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలోకి 30 కుటుంబాలు చేరిక : 30 వైసీపీ కుటుంబాలు టిడిపిలోకి చేరాయి. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సోమందేపల్లి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ, ఓల్డ్ టౌన్, శివానగర్ కు చెందిన 30 వైసిపి కుటుంబాలు తెలుగుదేశం పార్టీలోకి పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలోకి చేరిన వారికి సవితమ్మ పార్టీ కండువాలు వేసి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం పార్టీ పరిశీలకులు డాక్టర్ నరసింహ రావు, తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ఈ నెల 25న పౌర్ణమిసందర్భంగా ధర్మవరం ఆర్టీసీ డిపో నుండి అరుణాచల గిరిప్రదర్శనతపాటు కాణిపాకానికి ప్రత్యేక బస్సు సర్వీసును ఏర్పాటుచేసినట్టు డిపోమేనేజర్ సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 24న ఉదయం 6గంటలకే ప్రత్యేక బస్సు బయలుదేరుతుందన్నారు. అరుణాచలానికి రానుపోను చార్జీలు రూ.1400 ఉంటుందన్నారు. దర్శనానికి వెళ్లేవారు బస్సు కౌంటర్లో కానీ ఆన్లైన్లో కానీ సీట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు.

వృద్ధులకు ఉచిత వైద్యం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పట్టణంలోని నిరాశ్రయుల వసతి కేంద్రంలోని వృద్ధులకు క్రాంతి సొసైటీ, బ్రాహ్మణి సొసైటీ ఆధ్వర్యంలో మెప్మా వారి సహకారంతో ఉచిత వైద్యం అందించారు. మంగళవారం నిరాశ్రయుల వసతిగృహంలో వద్ధులకు వైద్య చికిత్సలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అలాగే మెప్మా మిషన్ డైరెక్టర్ వారి సౌజన్యంతో వాటర్ డిస్పెన్సర్ సౌకర్యం ఏర్పాటు చేశారు. మెప్మా అధ్యక్షురాలు సాయి లీలా రెడ్డి చేతుల మీదుగా ఈ వాటర్ డిస్పెన్సర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్రాంతి సొసైటీ అధ్యక్షులు శ్రీరామ్ రెడ్డి, అనసూయమ్మ, మెప్మా డిపిఎంపి శ్రీనివాస్ రెడ్డి, సిఎంఎం రమాదేవి, సీఈవోలు ఆదినారాయణ, ధరణి తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపిస్తే ప్రమాదం

ప్రజాశక్తి బుక్కపట్నం

మానవ శరీరంలో అయోడైన్ తగ్గితే ఆరోగ్యానికి హానికరమని ఎన్‌సిడి సమన్వయకర్తలు డాక్టర్ నివేదిత, బాలాజీ తెలిపారు. మంగళవారం స్థానిక మెయిన్ స్కూల్ నందు 12 సంవత్సరాల లోపు ఉన్న 90 మంది బాలబాలికలకు అయోడిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయోడిన్ లోపం ఉంటే జనన ప్రక్రియ మందగిస్తుందని, థైరాయిడ్ గ్రంధి హార్మోన్లను విడుదల చేయాలంటే అయోడిన్ తప్పనిసరి అని అన్నారు. అయోడిన్ లోపం ఉంటే పిల్లలలో మానసిక శారీరక ఎదుగుదల లోపిస్తాయని చెప్పారు. ఉప్పు ద్వారానే కాకుండా చేపలు, రొయ్యలు, పాలు, గుడ్లు ద్వారా అయోడిన్ లభిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సునీల్ కుమార్, ప్రధాన ఉపాధ్యాయుడు రామకృష్ణ, హెల్త్ సూపర్వైజర్ లింగ రామ్మోహన్, సిబ్బంది రామాంజనమ్మ, మానస, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయంలో ప్రత్యేక భద్రతా చర్యలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి ఆదేశాలతో ప్రశాంతి నిలయంలో పటిష్టమైన భద్రతా చర్యలను పోలీసులు చేపట్టారు. మంగళవారం సాయంత్రం పుట్టపర్తి అర్బన్ సిఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో , ఎస్ఐ రాజేష్ పోలీస్ సిబ్బందితో కలిసి ప్రశాంతి నిలయంలో సూపర్ బజార్, క్యాంటీన్, మందిరంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టారు.

'ఏఈ మాకొద్దు'

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న అసిస్టెంట్ ఇంజనీరింగ్ స్వాతి ఇక్కడ నుంచి రిలీవ్ చేయాలని పుట్టపర్తి మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించింది. మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో మెజార్టీ సభ్యులు మాట్లాడుతూ ఏఈ స్వాతి తన విధులను సక్రమంగా నిర్వర్తించడం లేదని ఆమెను కమిషనరేట్‌కు సరెండర్ చేయాలని తీర్మానించారు. అలాగే రూ. 20 లక్షలు ఎన్నికలకు ఖర్చుల కోసం జనరల్ ఫండ్ లో కేటాయించాలని అధికారులు పెట్టిన అంశాన్ని కౌన్సిలర్లు అందరూ వ్యతిరేకించారు. అసలే నిధుల కొరత వల్ల అనేక సమస్యలు పరిష్కారం కావడం లేదని అటువంటప్పుడు ఎన్నికల కోసం నిధులు కేటాయించడం సరికాదని సభ్యులు వ్యతిరేకించారు. టిడిపి కౌన్సిలర్ రత్నప్ప చౌదరి మాట్లాడుతూ పెద్ద కమ్మవారిపల్లిలో తాగునీటి సమస్య నెలకొందని వీధిలైట్లు వేయాలని ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేకపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారపక్ష కౌన్సిలర్లు సాయి గీత, చెరువు భాస్కర్ రెడ్డి, సూర్య గౌడ్ మాట్లాడుతూ, పట్టణంలో ఎక్కడ చూసినా చెత్తా చెదారంతో కంపు కొడుతుందని విధులు నిర్వర్తించడంలో నిర్లక్ష్యం చూపిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కమిషనర్ అంజయ్య మాట్లాడుతూ సభ్యులు చెప్పిన అంశాలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



కౌన్సిల్‌మీట్‌లో మాట్లాడుతున్న సభ్యులు

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి బుక్కపట్నం

నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ లక్షమని, నైపుణ్య అభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూం, సర్పంచి నాగలక్ష్మి రాజు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో 13 కంపెనీల ప్రతినిధులు హాజరై 309 మంది విద్యార్థులకు ను ఇంటర్వ్యూలు నిర్వహించారు. అందులో 152 విద్యార్థులు వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ నిరుద్యోగ యువత కోసం నైపుణ్య అభివృద్ధి సంస్థ జాబ్ మేళా నిర్వహించి, ఉద్యోగ అవకాశాలు కల్పించడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మక్బూల్ హుస్సేన్, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శివరంగ ప్రసాద్, లీడ్ బ్యాంకు మేనేజర్ రమణకుమార్, జిల్లా అగ్రి అడ్వైజర్ చైర్మన్ రమణారెడ్డి, జడ్పిటిసి శ్రీలత గోవర్ధన్ రెడ్డి, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

అధిష్టానం ఆదేశిస్తే పోటీ చేస్తా

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశిస్తే పుట్టపర్తి నియోజకవర్గం అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేస్తానని మిద్ది శివారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. ఒడిసి మండలం కొండకమర్లలో బాల్యమంతా గడిపి గోరంట్లలో వేరుశనగ మిల్లు నడుపుతున్నానన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో తనకు మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. పార్టీ కష్ట కాలంలో సైతం తాను పార్టీ నే నమ్ముకోని పనిచేస్తున్నామన్నారు. ఇటీవలనే పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలకు బయోడేటా సమర్పించామన్నారు. ఇటీవల అనంతపురం జిల్లాలో జరిగిన కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభ విజయవంతం చేయడానికి తన వంతు కృషి చేసినట్లు వివరించారు. తన సేవలను పార్టీ గుర్తించి టికెట్ ఇవ్వాలని కోరుతున్నానన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జయరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మిద్దె శివారెడ్డి

శ్రీవారి హుండీ ఆదాయం రూ.79లక్షలు

కదిరి టౌన్ : ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి శ్రీవారి హుండీల లెక్కింపు మంగళవారం నిర్వహించారు. నగదుగా రు.78,71,911లు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వెండిదండి శ్రీనివాసరెడ్డి అధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నరసింహరాజు, ఆలయ సిబ్బంది, మధుసుధన్, మేనేజర్, కెనరా బ్యాంకు కదిరి శాఖ, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చేసిన మేలును వివరించండి

ప్రజాశక్తి బత్తలపల్లి

ప్రతి రోజూ ఐదారు ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం చేసిన మేలును వివరించాలని వైసిపి మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ రాంభూపాల్ రెడ్డి బూత్ కమిటీ సభ్యులకు సూచించారు. మంగళవారం మండలంలోని 13 గ్రామ పంచాయతీలలోని బూత్ కమిటీ సభ్యులతో 'నేను సిద్ధం–నా బూత్ సిద్ధం' సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రోజు గ్రామంలోని ఐదారు ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం చేసిన మేలును వారికి వివరించి, వారి ఓట్లు వైసిపికి పడేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు

బత్తలపల్లి : మండలంలోని ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా చర్యలు చేపడతున్నారు. మండలంలోని దంపెట్ల–ఓబుళాపురం గ్రామాల మధ్య దాదాపు 600 మీటర్లు పొడవు సత్యసాయి తాగునీటి పథకం పైపులైన్ లీకేజీ వల్ల ఓబుళాపురం, చిన్నేకుంటపల్లి, వరదాపురం, విశ్వనాథపురం, సంగాల గ్రామాలకు సత్యసాయి నీరు సరఫరా కావడంలేదు. దీంతో వేసవిలో తాగు నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రోత్సాహంతో బత్తలపల్లి ఎంపీపీ బగ్గిరి త్రివేణి, వైసిపి మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి ఆధ్వర్యంలో తాగునీటి పైపులైన్ వేయిస్తున్నారు. ఇదిలా ఉండగా జలజీవన్ మిషన్ కింద రూ. 28 లక్షలతో విశ్వనాథపురం గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించి అక్కడ నుంచి నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తద్వారా ఆయా గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా ఉంటుందన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

బత్తలపల్లి : ధర్మవరం పట్టణంలో ఈనెల 17 నుండి విశ్వదీప సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత కంప్యూటర్ శిక్షణను యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని విశ్వదీప సేవా సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం బత్తలపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ ధర్మవరం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కోళ్లమొరం చంద్రశేఖరరెడ్డి తల్లిదండ్రులైన కోళ్లమొరం సంజీవరెడ్డి, నారాయణమ్మ జ్ఞాపకార్థం గత 12 సంవత్సరాలనుండి నిర్వహిస్తున్న ఉచిత కంప్యూటర్ శిక్షణ ద్వారా ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్నారన్నారు. ఈ సంవత్సరం కూడా ఉచిత కంప్యూటర్ శిక్షణలో డిసిఎ, అడ్వాన్స్ ఎమ్మెస్ ఆఫీస్, సి లాంగ్వేజ్, టాలీ, ఫోటోషాప్, తెలుగు, హిందీ టైపింగ్ కోర్సులు నేర్పిస్తారన్నారు. ఈనెల 17 నుండి తరగతులు ప్రారంభించబడునన్నారు. ఆసక్తిగల విద్యార్థినీ,విద్యార్థులు నిరుద్యోగులు సేవా సంఘం కార్యాలయంలో వారి పేర్లు నమోదు చేసుకోవాలని ఫౌండర్ కోళ్ల మొరం చంద్రశేఖరరెడ్డి, అధ్యక్షుడు గాజుల సురేష్,సెక్రటరీ దేవరకొండ చంద్ర,లక్ష్మీనారాయణ, టిసి శేఖర్ రెడ్డి, రఘు,సేవా సంఘం సభ్యులు తెలిపారు.

పేదరికం లేని సమాజమే లక్ష్యం

ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పేదరికం లేని సమాజాన్ని నిర్మించడమే సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వైసిపి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వం జగనన్న కాలనీలలో వివిద లేఅవుట్లలో ఇంటి పట్టాలు పొందిన లబ్దిదారులకు ప్రభుత్వం ఉచితం చేయించిన రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. అంతకుముందు టీడీపీ అల్లరి మూకల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న గీతాంజలికి ఆత్మశాంతి కలగాలని కోరుతూ రెండు నిమిషాలు పాటు మౌనం పాటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను 99శాతం అమలు చేసి విశ్వసనీయతను చాటుకున్నారన్నారు. నేతన్నలు అధికంగా నివశించే ధర్మవరం లాంటి ప్రాంతంలో ఇప్పటికే జగనన్న కాలనీల ద్వారా 13, 356 ఇళ్లు, టిడ్కో అపార్ట్మెంట్ల ద్వారా 14,440 ప్లాట్లు కేటాయించడం జరిగిందన్నారు. పట్టణానికి అతి చేరువలో 1.50సెంట్ల స్థలంలో చేనేత కార్మికులకు ఇంటితో పాటు మగ్గంషెడ్ నిర్మించుకునేలా సాయం అందించడం జరిగిందన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రజలంతా సంపూర్ణంగా మద్దతు తెలిపి వైసిపిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ, వైస్‌చైర్మన్లు వేముల జయరామిరెడ్డి, షంషాద్ బేగం, మున్సిపల్ కమిషనర్ రామ్ కుమార్, పట్టణాధ్యక్షులు కోటిరెడ్డి బాలిరెడ్డి, నీలూరి ప్రకాష్, సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, కౌన్సిలర్లు, గోరకాటి పురుషోత్తం రెడ్డి, పెనుజూరి నాగరాజు, జెసిబి రమణ, చింతా ఎల్లయ్య, కడప రంగస్వామి, బ్రహ్మయ్య, ఎస్పీ షకీల, వైసిపి వార్డు ఇన్‌ఛార్జులు కాచర్ల అంజి,చాంద్ బాషా, గడ్డం రంగా,ఉడుముల రాము, తొండ మాల రవి, గుద్దిటి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టిడిపికి పూర్వ వైభవం తెద్దాం

ప్రజాశక్తి మడకశిర



ఎన్నికల ప్రచారంలో నాయకులు, కార్యకర్తలు

మడకశిర నియోజకవర్గంలో టిడిపికి పూర్వవైభవం తీసుకువద్దామని మాజీ ఎమ్మెల్యే ఈరన్న, రాష్ట్ర వక్కలిగ కన్వీనర్ వి ఎం పాండురంగప్ప కోరారు. ఈ మేరకు వారు మంగళవారం అగళి, ఇరిగేపల్లి నందరజానపల్లి గ్రామాల్లో నాయకులు కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల కాలంలో వైసిపి ప్రభుత్వంతో ప్రజలు విసుగెత్తారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి నాయకుల కుంతత్రాలను తిప్పికొట్టి సమర్థవంతంగా పార్టీ అభ్యర్థి గెలుపునకు పాటు పడాలన్నారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షులు ఉగ్రనరసింహాప్ప, మాజీ కన్వీనర్ ముకుందప్ప, మాజీ ఎంపీపి రామక్రిష్ణప్ప, మాజీ సర్పంచి రవి కుమార్, లింగన్న, మాజీ ఎంపీటిసి మల్లేష్, లెజెండ్ సుధాకర్, మాజీ సింగల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్, మాజీ సింగల్ విండో డైరెక్టర్ రామన్న, నాయకులు మంజు చరణ్, తెలుగు యువత ప్రవీణ, కామరాజు మల్లేశప్ప మంజునాథ్, హరీష్, శీన తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి- ధర్మవరం టౌన్

ప్రస్తుత సమాజంలో మహిళలు పురుషులకు తగ్గట్టుగా అన్నిరంగాల్లో రాణిస్తున్నారని ఎఎఫ్ఎకాలజీ సంస్థ కోఆర్డినేటర్ ఏఎల్పీ రిజ్వానా పేర్కొన్నారు. మంగళవారం అంతర్జాతీయ మహిళదినోత్సవాన్ని ఎఎఫ్ ఎకాలజీ ఆధ్వర్యంలో పట్టణంలోని సాయిబాబా కళ్యాణమండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాబార్డు డీఎం అనురాధ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో మహిళలు ఎదుర్కొం టున్న సమస్యలు, చట్టాలు, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, మహిళలు స్వయం ఉపాధితో ఏవిధంగా ఆర్థికాభివృద్ధి చెందాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎకాలజీ సంస్థ సిబ్బంది వీరభద్రరెడ్డి, అడ్వకేట్ సుమలత, ఐసీడీఎస్ సూపర్వైజర్ వైష్ణవి, లక్ష్మీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : స్థానిక ఆర్డీటీ ఫీల్డ్ ఆఫీసులో ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కదిరి రీజనల్ డైరెక్టర్ శాంతమ్మ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఒ మోహనమ్మ, మహిళ పోలీస్ సిబ్బంది, ఆర్డీటీ ఎటిఎల్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



సూపర్‌సిక్స్ కిట్ అందజేస్తున్న దృశ్యం

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి మడకశిర

టిడిపితోనే అభివృద్ధి సాధ్యమని ఆపార్టీ మడకశిర అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ సునిల్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణం పరిధిలోని శ్రీ మెట్టబండ ఆంజనేయస్వామి ఆలయ పక్కన కమ్యూనిటీ భవనంలో నియోజకవర్గంలోని టిడిపి బూత్ కమిటీ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో డాక్టర్ సునిల్‌కుమార్ నాయకులు,కార్యకర్తలకు సూపర్‌సిక్స్ కిట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

నల్లచెరువు : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రినికదిరి డివిజన్ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ నాగేంద్ర నాయక్ మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన హాజరుపట్టికను, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కల్పన, సిహెచ్ఒ రామచంద్రారెడ్డి, పిహెచ్ఎన్ భారతి, సూపర్వైజర్ రెడ్డమ్మ, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన

పుట్టపర్తి రూరల్: సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాజకీయ పక్ష నాయకులు, నియోజకవర్గంలోని తహశీల్దార్లతో మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెవిన్యూ డివిజనల్ అధికారి భాగ్య రేఖ ఆధ్వర్యంలో పుట్టపర్తిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులకు , పుట్టపర్తి నియోజక వర్గం లోని తహశీల్దార్లు, మునిసిపల్ కమిషనర్‌కు ఎన్నికలకు సంబందించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహశీల్దార్లు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు ప్రారంభం

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండలం, మల్లయ్యగారిపల్లి నుండి కొత్తపల్లి వరకు రూ. 120 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంట్ కాంక్రీట్ రోడ్డును ఎమ్మెల్యే సిద్దా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సహకారంతో రూ.120 లక్షల రూపాయలతో గ్రామీణ రహదారులకు మోక్షం లభించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే



చలివేంద్రం ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్

చలివేంద్రం ప్రారంభం

రొద్దం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ మంగళవారం ప్రారంభించారు. ప్రజల దాహార్తి తీర్చడానికి తహశీల్దార్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కేశవరెడ్డి, డిటి చంద్రశేఖర్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి - మడకశిర

మండల పరిధిలోనిగౌడనహళ్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వైద్యాధికారులు ఆరోగ్యంపై మంగళవారం అవగాహన కల్పించారు. డిప్యూటీ డి ఎం హెచ్ఒ మంజువాణి విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేషనల్ అయోడిన్ డెఫిషియన్సీ డిసార్డర్ ప్రోగ్రాం డాక్టర్ మాధుర్య ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ గౌడనహళ్లి స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో డాక్టర్ వినోద్ కుమార్, సూపర్వైజర్ రాంప్రసాద్ , సరస్వతి , శేషాచలం, చెన్నకేశవరెడ్డి, ఎఎన్ఎం శశికళ, పద్మ, విశాలత సిహెచ్ఒ హుస్సేన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతుకు పరామర్శ

ప్రజాశక్తి - ఓబుళ దేవర చెరువు

మండల పరిధిలోని ఇనగలూరు చెందిన టిడిపి కార్యకర్త శబరిష్ నాయుడు పొలంలో గుర్తుతెలియని వ్యక్తులు రెండు రోజుల క్రితం పంటకు నిప్పుపెట్టారు. దీంతో సుమారు రెండు ఎకరాల్లో సాగు చేసిన కొర్ర పంట వ్యవసాయ మోటారు విద్యుత్ వైర్లు, డ్రిప్పు పరికరాలు కాలిపోయి సుమారు రూ. 3 లక్షల వరకు నష్టం జరిగింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి రఘునాథరెడ్డి బాధిత రైతు శబరిష్ నాయుడును మంగళవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. పంట నష్టాన్ని అంచనా వేసి రైతును ఆదుకోవాలని ఫోన్ ద్వారా తహశీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జడ్పిటిసి పిట్టా ఓబుల్ రెడ్డి లక్ష్మీనారాయణ రెడ్డి, జాకీర్, గంగాధర్ , కొండే ఈశ్వరయ్య, జయ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్ దగాకోరు : బికె.పార్థసారథి

ప్రజాశక్తి -పెనుకొండ

జగన్‌రెడ్డి పచ్చి అబద్దాల కోరు అని మేదరమెట్లలోనూ అబద్దాల విషపు జల్లు కురిపించారని టీడీపీ జిల్లా అధ్యక్షులు, పెనుకొండ మాజీ ఎమ్మెల్యే బి.కె.పార్థసారథి విమర్శించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 85శాతం హామీలు అమలు చేయకుండా జగన్ మాట తప్పాడన్నారు. సంక్షేమానికి బడ్జెట్ లో జగన్ 15శాతం ఖర్చు చేయగా చంద్రబాబు 19శాతం ఖర్చు చేశారన్నారు. జగన్ ప్రజా విశ్వాసం కోల్పోయినందునే సభకు నిండా లక్ష మంది కూడా రాలేదన్నారు. తన మోసాల్ని టీడీపీకి అంటగట్టి చెప్పిన అబద్ధమే వందసార్లు చెప్పడం జగన్ నైజం అన్నారు. ప్రజల్ని మోసం చేయడానికి, మాయ చేయడానికి మేదరమెట్లకు 6 జిల్లాల్లోని 50 నియోజకవర్గాల నుండి ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల్లో వంద కోట్లు ఖర్చు చేసి జనాన్ని తరలించే ప్రయత్నం చేశారని అయినా సభ వెలవెలబోయిందని అన్నారు. అందుకే మీడియాపై ఆంక్షలు పెట్టారని విమర్శించారు. జగన్‌ది వాపే కాని బలం కాదని తేలిపోయిందని ఎద్దేవా చేశారు.

నేరాలు ఘోరాలు

పేకాట జూదరులు అరెస్టు

చిలమత్తూరు : మండల పరిధిలోని గొర్రెళ్లపల్లి శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న 11 మంది జూదరులను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. వారి వద్ద నుండి రూ.1.51లక్షల నగదు, 11 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన వారిలో గతంలో హిందూపురం రూరల్ లో పని చేసిన పోలీసు అధికారికి డ్రైవర్‌గా ఉన్న వ్యక్తి ఉన్నారు. పేకాటను ఈ వ్యక్తే ముందు ఉండి నడిపిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. తాను సిఐ కి డ్రైవర్ గా ఉన్నప్పటి నుండి పేకాట స్థావరాలను జూదరులను గుర్తించి వారితో చేయి కలిపి పేకాటను ఆడిస్తున్నారన్న ప్రచారం ఊపందుకుంది. డ్రైవరే పేకాట ఆడిస్తున్నారా లేక అతని వెనుకల ఎవరి హస్తం అయినా ఉందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు 11 వ్యక్తిగా డ్రైవర్ ని చేర్చి కేసులు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఓబుళదేవర చెరువు : మండలంలోని గాజుకుంట్లపల్లి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలకేంద్రానికి చెందిన వ్యక్తికి గాయాలు అయ్యాయి. మండలకేంద్రాన్ని చెందిన టిడిపి కార్యకర్త రామాంజి ఒడిసి నుండి ద్విచక్రవామణంలో వెళుతుండగా గాజుకుంట్లపల్లి వద్ద అదుపు తప్పి కింద పడింది. ఈ ప్రమాదంలో రామాంజికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనం ద్వారా ఆసుపత్రికి తరలించారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

పెనుకొండ : నియోజకవర్గంలోని సోమందేపల్లి మండలం ముద్దప్పుకుంట గ్రామానికి చెందిన టీడీపీ కుటుంబ సభ్యులు శివ ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో శివమృతదేహాన్నిపోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న టీడీపీ జిల్లా అధ్యక్షులు పార్థసారథి మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా పెనుకొండ మండలంలోని చంద్రగిరి గ్రామానికి చెందిన మల్లారెడ్డి పాముకాటుకు గురై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటుండగా మల్లారెడ్డిని బికె పరామర్శించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

రొద్దం : పౌష్టికాహారంతో ఆరోగ్యం లభిస్తుందని అంగన్వాడీ సూపర్ వైజర్ అన్నారు. మంగళవారం మండలంలోని కుర్లపల్లి, నాగిరెడ్డి పల్లిలో సూపర్ వైజర్ అనురాధ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంనకు పెనుకొండ ప్రాజెక్టు సీడీపీవో శాంతలక్ష్మి హాజరై గర్భిణులకు, బాలింతలకు పోషకాహారం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సౌభాగ్య, ఈశ్వరమ్మ, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

15న మండల మీట్

కొత్తచెరువు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 15న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సిద్ధారెడ్డి తెలిపారు. ఎంపీపీ గాయత్రి అధ్యక్షతన నిర్వహించే ఈసమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, ఆయాశాఖల అధికారులు తదితరులు హాజరుకావాలని ఆయన కోరారు.

టీడీపీలో పలువురు చేరిక

ఓబుళదేవరచెరువు : మండలంలోని ఇనగలూరు పంచాయతీలోని గొల్లపల్లిలో వైసీపీ నుంచి తొమ్మిది కుటుంబాలు టిడిపిలో చేరాయి. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఇద్దే లక్ష్మినారాయణ రెడ్డి, ఇద్దేగంగిరెడ్డి, ఇద్దే ఆదినారాయణ రెడ్డి కుటుంబాలు టిడిపిలో చేరాయి. బొడిద్దులవాండ్ల పల్లి కి చెందిన నాగరాజు ,గొల్లపల్లి కి చెందిన పెయింటర్ వీరాంజనేయులు, చంద్రనాయక్ వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు జయచంద్ర , పిట్టా ఓబుల్ రెడ్డి, పొగాకు జాకీర్, నిజాం, శబరీష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాబయ్య స్వామి దర్గాలో ఇఫ్తార్

ప్రజాశక్తి -పెనుకొండ

పట్టణంలోని బాబయ్య స్వామి దర్గా లో వంశపారంపర్య పీఠాధి పతి తాజ్ బాబా ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ మాసంలోని పూర్తి 30 రోజులు ఇఫ్తార్, షహరీ దావత్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా ఉపవాసం ఉన్న భక్తులకు షహరీ, ఇఫ్తార్ సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మొదటి రోజు సహరీ దావత్ లో సుమారు 500 వందల మంది దావత్‌ను సద్వినియోగం చేసుకున్నారని కాబోయే పీఠాధి పతి నజర్ హుస్సేని తెలిపారు.

రక్తదాన శిబిరం

గోరంట్ల : పట్టణంలో ఎస్పీవీఎం డిగ్రీ కళాశాలలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 42 మంది విద్యార్థులు ఉపాధ్యాయులు రక్తదానం ఇచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ భక్తవత్సలం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒలు ఆజాద్, రఘునాథ్ రెడ్డి, బాల మోహన్, రామచంద్ర, వెంకటేష్, చైతన్య స్కూల్ ప్రిన్సిపల్ మోహన్ రెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ సెక్రెటరీ రవికుమార్, కోఆర్డినేటర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు

నేటి నుంచి పెద్దకమ్మవారిపల్లిలో ఉత్సవాలు

పుట్టపర్తి అర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద కమ్మవారిపల్లెలో రెండు రోజులపాటు పెద్ద ఎత్తున తిరునాళ్ల జరగనున్నాయి అందులో భాగంగానే మంగళవారం ఏలువ గంప ఊరేగించారు. బుధవారం మొక్కుబడులు చెల్లించుకోవడానికి చిన్న పిల్లలకు కేశఖండన కార్యక్రమాలు చేపడతారు. అక్కడున్న లింగమయ్య, పోతులప్ప, చెన్నకేశవ స్వామిని దర్శించడానికి పరిసర గ్రామాల నుంచి మండలాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరుకానున్నారు. బుధవారం సాయంత్రం ఎద్దుల పండ్ల పోటీలు నిర్వహించారు.

సురక్షిత నీటిని అందిస్తాం

హిందూపురం : హిందూపురం రూరల్ మండలం తూమకుంట గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న ప్రతి ఒక్కరికి శుద్ధ జలం అందిస్తామని సర్పంచి రత్నమ్మ అన్నారు. మంగళవారం తూమకుంటలో ఉన్నా నీటి సరఫరా ట్యాంక్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కెంచరాయప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవం



పుట్టపర్తిలో నిర్వహించిన కార్యక్రమంలోపాల్గొన్న నాయకులు



హిందూపురంలో నిర్వహించిన కార్యక్రమంలోపాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి లోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పార్టీ ఆవిర్భావ వేడుకలలో నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు డిఎస్ కేశవరెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందూపురం : బడుగు బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైసిపి నాయకులు వేణురెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పార్టీ 14వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పరిగిబస్టాండ్‌లో ఉన్నా వైఎస్ విగ్రహానికి నాయకులు, కార్యకర్తలతో కలిసి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వైసీపీ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి అందరికి పంచారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేసి ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్థులు దీపిక, శాంతమ్మలను భారీ మెజార్టీతో గెలుపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మధుమతి రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు, రాష్ట్ర డైరెక్టర్లు, మార్కెట్ యార్డ్ చైర్మన్, వైస్ చైర్మన్, మున్సిపల్ వైస్ చైర్మన్లు, జడ్పిటిసిలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, మండల, టౌన్ కన్వీనర్లు, కౌన్సిలర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం : మండలంలో మంగళవారం వైసిపి దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి స్వారాక్క నరసింహామూర్తి, ఎంపీటీసీ హనుమంతరాయ, వీర జాతరయప్ప, నారాయణ గౌడ, జీసెస్ కన్వీనర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండలంలో మంగళవారం వైసిపి దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మండలకేంద్రంలోనివైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్పీటీసీ సభ్యులు బాణాల శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఎంపీపీ లీలావతి, అగ్రి బోర్డ్ చైర్మన్ ప్రభాకర్. ఎంపీటీసీలు జైకిసాన్,ఆదినారాయణ, సర్పంచులు, ఆదినారాయణ, మంజునాథ్, ఆశ్వతప్ప, వసుంధర, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ తిప్పన్న, బీసీ సెల్ అధ్యక్షులు బాలు తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : స్థానిక వైయస్సార్ సర్కిల్ లో సింగిల్ విండో అధ్యక్షులు లక్ష్మి నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మినారాయణ రెడ్డి, నగరూరు ధనుంజయ రెడ్డి, రెడ్డిపల్లి విజయ భాస్కర్ రెడ్డి, మారుతి, శ్రీహరి, సినిమా నారాయణ, శ్రీనివాసులు, విజయ్,అంజి,రవి,హరినాథ రెడ్డి, నాగిరెడ్డిపల్లి నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కదిరి వైసిపి కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ నజీమున్నిస సాదిక్ ఆధ్వర్యంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో మాజీ సమన్వయకర్త ఇస్మాయిల్ , అజ్జుకుంట రాజశేఖర్ రెడ్డి పట్టణ అధ్యక్షులు జిలాన్, కౌన్సిలర్ల మురళి ,ఇలాహి ,ఓం ప్రకాష్ ,జయం రవి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నూరు గంగాధర్ , సోషల్ మీడియా కదిరి నియోజకవర్గ కన్వీనర్ మహబూబ్ ఖాన్ ,ప్రముఖ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండల కేంద్రంలోని వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద వైసిపి నాయకులు మంగళవారం వైసిపి ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల లేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల జేసీ కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ జి రవీందర్ రెడ్డి, ఎంపీపీ జగన్మోహన్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఎస్ ఫయాజ్ అలీ, మండల ఆర్‌బికె చైర్మన్ వైవి శంకర్ నాయుడు, పామిడి మహమ్మద్ ఇక్బాల్, సి పురుషోత్తం రెడ్డి, మహమ్మద్ ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి : మండల కేంద్రంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమాన్ని మంగళవారం మంత్రి ఉషశ్రీ చరణ్ భర్త చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆత్మీయ పలకరింపు కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో పర్యటించిన చరణ్ రెడ్డి పరిగి మండల కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసే ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ప్రభాకర్, శ్రీరాములు, కన్వీనర్ నరసింహ మూర్తి, సర్పంచులు లక్ష్మీదేవి, శివశంకర్, మంజునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.